క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు


జల్దిబిందె కార్యక్రమంలో భక్తులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పెద్దచెరువు వద్ద ఉన్న మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి భోగి పండుగ రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం జల్దిబిందె తీసుకువస్తారు. అలాగే మహిళలు బోనాలతో స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతగిరి: వికారాబాద్ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ చేతుల మీదుగా పట్టణంలోని జగజ్యోతి బసవేశ్వర విద్యాసంస్థ ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు అప్ప విజయ్‌కుమార్, వీరేశం, బిచ్చప్ప, విద్యాసాగర్, భద్రప్ప, కేటీ సంగప్ప, వీరన్న, దయానందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చైతన్యనగర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్



తాండూరు టౌన్: పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్) కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కేంద్ర మంతి కిషన్‌రెడ్డి నేడు తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని చైతన్యనగర్‌కు రానున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పీఎం జన్‌మన్ పథకం పేరిట దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో, 3 ఏళ్లలో రూ. 24వేల కోట్ల నిధులు వినియోగించే బృహత్తర కార్యక్రమాన్ని కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు నేడు కిషన్‌రెడ్డి రానున్నట్లు చెప్పారు.

శ్రీవారి సన్నిధిలో సంకీర్తనలు చేయడం అదృష్టం


సంకీర్తనల్లో పాల్గొన్న భజన మండలి సభ్యులు

అనంతగిరి: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తనం చేయ డం పూర్వజన్మ పుణ్యఫలమని ధ్యాచారం గ్రామ హనుమాన్ భజన మండలి సభ్యులు అన్నారు. తిరుపతి దేవస్థాన సన్నిధిలో శనివారం అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం వికారాబాద్ మండల ధ్యాచారం గ్రామ హనుమాన్ భజన మండలి సభ్యులు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో అనేక సంకీర్తనలు పాడారు. స్వామి వారి సేవలో పాత్రులయ్యారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పటోళ్ల శంకరప్ప, బోయిని నర్సింలు, పటోళ్ల ప్రభులింగం, బోయిని పాపయ్య, చాకలి నర్సింహులు, చాకలి అనంతయ్య, పి. శంకరప్ప, ముష్టి లక్ష్మయ్య, చాకలి రాములు, శేఖర్, మహేందర్, అనిల్, మనోజ్ ఉన్నారు.

న్యాయ్ యాత్రను విజయవంతం చేయండి

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



ధారూరు: రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి ఆదివారం ప్రారంభించిన న్యాయ్ యాత్రను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈ యాత్ర దేశ ప్రజల జీవితాలను, దేశ రాజకీయాలను మలుపు తిప్పుతోందన్నారు. రాహుల్‌గాంధీ న్యాయకత్వంలో కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్య క్తం చేశారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మెజార్టీ లోక్‌సభ సీట్లను కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు అవుతాయని తెలిపారు.

సీఎస్ఈ విద్యార్థి ప్రతిభ అభినందనీయం

మొయినాబాద్‌రూరల్: రాయల్ మిస్టర్ ఇండియా పోటీల్లో కేఎల్ యూనివర్సిటీ సీఎస్ ఈ విద్యార్థి అన్సర్ ప్రతిభ అభినందనీయమని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు. ఆదివారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు.

భోగి సంబురాలు

భోగి పండగ పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. ఇళ్ల ఎదుట రంగు రంగుల ముగ్గులతో యువతులు, మహిళలు అలరించారు. చిన్నారులు, యువకులు పతంగులు ఎగురవేసి ఉత్సాహంగా గడిపారు. సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఇళ్ల ముందు గంగిరెద్దులను ఆడించారు. గ్రామాల్లో ముగ్గుల పోటీలు, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బంధువుల, ఆటపాటలతో పల్లెకు సంక్రాంతి సందడి తెచ్చింది. –సాక్షి, నెట్‌వర్క్


వికారాబాద్‌లో పతంగులు కొనుగోలు చేస్తున్నయువతీ, యువకులు


కొడంగల్ రూరల్ : ముగ్గులు వేస్తున్న చిన్నారులు


కొడంగల్ రూరల్ : గంగిరెద్దుల కోలాహలం


వికారాబాద్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు


అనంతగిరి: ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


తాండూరు టౌన్‌లో చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న తల్లిదండ్రులు


దోమ: పతంగులను ఎగురవేస్తున్న స్థానికులు


హిందూవాహిని ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు


తాండూరు: చిన్నారిపై భోగి పండ్లు వేస్తున్న దృశ్యం


దోమ: మహిళలకు బహుమతులను అందజేస్తున్న గ్రామస్తులు


వికారాబాద్‌లో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు

బోగస్ వివరాలతో ఆధార్ కార్డులు!

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలుగా ఎర వేసి, బాధితుల నుంచి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు చాలా కీలకం. వీటిని తమ పేర్లు, వివరాలతో తీసుకుంటే పోలీసులకు చిక్కే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో సూత్రధారులు ఈ ఖాతాలను తెరిచి ఇవ్వడానికి ఉత్తరాదిలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. బోగస్ వివరాలతో తెరిచిన ఒక్కో బ్యాంక్ ఖాతాను రూ.25 వేలకు విక్రయిస్తున్న ఇద్దరు ఫరీదాబాద్ వాసులను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఢిల్లీ వాసి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సంయుక్త సీపీ ఏవీ రంగనాథ్ ఆదివారం వెల్లడించారు.

ఉద్యోగాల పేరుతో ప్రకటనలిచ్చి...

ఢిల్లీకి చెందిన ఘరానా సైబర్ నేరగాడు దేవేందర్ పంచాల్ దేశ వ్యాప్తంగా అనేక మంది నుంచి భారీ మొత్తం దండుకున్నాడు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇవ్వడం, ఆకర్షితులై స్పందించిన వారితో సంప్రదింపులు జరపడం చేస్తుంటాడు. ఆపై ఉద్యోగానికి ముందు తమ వద్ద కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించి అందినకాడికి దండుకుంటారు. ఇలా నగరంలోని అమీర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ బాధితుడి నుంచి రూ.4.75 లక్షలు కాజేశాడు. ఈయన ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు దీన్ని దర్యాప్తు చేశారు. బాధితుడు ఓ బ్యాంకు ఖాతాలో డబ్బు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయగా... అది ఢిల్లీలోని రిచిక ఇన్ఫోసిస్టమ్స్ పేరుతో ఉన్న కరెంట్ ఖాతాలోకి బదిలీ అయినట్లు గుర్తించారు. ఇందులో మొత్తం రూ.2.5 కోట్లు డిపాజిట్ కాగా... ఖాతాలో ఉన్న రూ.6 లక్షలు ఫ్రీజ్ చేశారు. ఈ కరెంట్ అకౌంట్‌ను పంజక్ చాహు అనే వ్యక్తి తెరిచినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు మూలాలు కనుక్కోవడంపై దృష్టి పెట్టారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి


క్రీడాకారులతో బొలుసాని శ్రీధర్ రెడ్డి

దౌల్తాబాద్: క్రీడలపై గ్రామీణ యువత ఆసక్తి చూపాలని డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు అన్నారు. మండలంలోని యాంకి గ్రామంలో శివాజీయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరూ ఆటలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బన్నీ, శివ, ఆసిఫ్, శివ తదితరులున్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: యువత క్రీడల్లో రాణించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలుసాని శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించడం వల్ల వారికి బహుముఖ ప్రయోజనాలు ఉంటాయన్నారు. చదువుకున్న యువకులకు వారి ఉద్యోగ అవకాశాల సందర్భంలో ఉపయుక్తంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒక వ్యక్తి ఆలోచన విధానంలో ఓర్పు, సహనం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సుమారు 30 మందికి టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, రాంరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

దోమ: గ్రామీణ ప్రాంత యువత క్రీడలపై దృష్టి సారించాలని సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు అన్నారు. ఆదివారం మండలంలోని బొంపల్లి గ్రామంలో వార్డు సభ్యుడు బోయిని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు విజయం సాధించటానికి ప్రయత్నించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం కలుగుతుందని తెలిపారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంతిరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సంగయ్య, గ్రామస్తులు షఫీ, రమేశ్, గుడిసె రాములు, రాజు, అక్రం, రాజేశ్‌యాదవ్, డి. వెంకటయ్య, జగన్, అప్పగాళ్ల రమేశ్, తాహెర్, మోహిజ్, రమేశ్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

బొంరాస్‌పేట: మండలంలోని చౌదర్‌పల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదివారం స్థానిక యువజన సంఘాల ఆధ్వర్యంలో తాలూకా స్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. వివిధ మండలాల నుంచి 16 వాలీబాల్ జట్లు ఉత్సాహంగా పాల్గొని ఆట ప్రతిభను చాటుకున్నారు. బహుమతులు మకర సంక్రాంతి అందజేయనున్నట్లు తెలిపారు.


దోమ : విజేతలకు బహుమతుల అందజేస్తున్న సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ రాములు

దయనీయంగా సర్కారు బడులు

- వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- ప్రభుత్వ బడులపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి

సర్కారు బడులు శిథిలావస్థకు చేరాయి. పలు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పలు చోట్ల కమ్యూనిటీ హాల్, పాఠశాల ఆవరణలోని చెట్లకింద ఉపాధ్యాయులు విద్యాబోధన సాగిస్తున్నారు.. పెద్దేముల్ మండలంలో 37 గ్రామ పంచాయతీల్లో 61 ప్రభుత్వ బడులు ఉన్నాయి. వీటిలో సగానికిపైగా పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీరు వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.. పలుచోట్ల ఉపాధ్యాయుల కొరతతో బోధనా సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం అధికారులు స్పందించి విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..


మదనంతపూర్‌లో అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల

పెద్దేముల్: సర్కారు బడుల పరిస్థితి అధ్వానంగా మారింది. పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం మండలంలో ఎక్కడా కానరావడం లేదు. పెద్దేముల్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 61 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఏటా సుమారు ఐదు వేలకు పైగా విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్నారు. పలు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు. మరి కొన్ని చోట్ల ఒకే టీచర్‌తో కాలం వెల్లదీస్తున్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో మండలం ఉండటంతో పాఠశాలల్లోని సమస్యలను ఫిర్యాదు చేసినా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా తాగునీరు, మూత్రశాలలు లేక విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. వంట గదులు లేక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో వంట గదుల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయి. తండాల్లో ఒకే గదుల్లో ఐదు తరగతులు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు లేరని విమర్శిస్తున్నారు. మదనంతపూర్‌తండాలో ప్రభుత్వ బడి కూలిపోయే స్థితిలో ప్రమాదకరంగా ఉండటంతో ఉపాధ్యాయులు కమ్యూనిటీ హాల్ తరగతులును కొనసాగిస్తున్నారు. అలాగే మారేపల్లితండాలో 1నుంచి 5వ తరగతి వరకు భవనాలు లేక అరకొర వసతులతో నడిపిస్తున్నారు. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్, ఎంపీటీసీలు మొర పెట్టుకున్న లాభం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుక్మాపూర్, ఇందూరు, గిర్మాపూర్, పెద్దేముల్ గ్రామాల్లో ప్రభుత్వ బడులు శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉన్నాయి. అయినా, వాటి గురించి పట్టించుకునే వారే లేరు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పడం తప్పా.. సమస్యల పరిష్కారం కావడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో కూడా పాఠశాల భవనం మంజూరు కాలేదని మదనంతపూర్ సర్పంచ్ గోవర్ధన్ అసహనం వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి భవనాలు కొరత ఉన్న పాఠశాలలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మారేపల్లితండాలోని పాఠశాల భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం


రుక్మాపూర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

వంట గదుల కొరత..

మండలంలోని అడ్కిచెర్ల, ఆత్కూర్, మదనంతపూర్, మన్‌సాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో పూర్తిస్థాయిల్లో వంట గదులు లేక పాఠశాల గదుల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో ఇళ్ల వద్ద వంటలు చేసి భోజనం తెస్తున్నారు. బుద్దారం గ్రామంలో సుమారు రెండేళ్ల నుంచి వంట గది అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ విషయమై మండల ఎంఈఓ వెంకటయ్యను వివరణ కోరగా కొత్త భవనాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వం త్వరలో కొత్త గదులతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభం కాని మన ఊరు -మనబడి పనులు

పెద్దేముల్ మండలంలో 20 పాఠశాలలకు మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నామ మాత్రంగా పనులు ప్రారంభమయ్యాయి. గత ఆరు నెలల క్రితం పెద్దేముల్ మండల కందనెల్లి పాఠశాలకు ఈడబ్ల్యూడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ,అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఈడబ్ల్యూడీసీ డీఈ రాజుతో పాటు పలువురు వచ్చి త్వరలో పనులు ప్రారంభం చేయాలని ఆదేశాలు జారి చేసినా మండలంలో ఎక్కడ పనులు అక్కడే దర్శనమిస్తున్నాయి.

ప్రతి ఇంటికీ రామనామం

కుల్కచర్ల: అయోధ్యలో శ్రీరాములవారి ఆలయ ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి రామనామం వెళ్లాలన్న దృఢ సంకల్పంతో హిందూ ఉత్సవ కమిటీలు, రామభక్తులు జై శ్రీరామ్ అనే నినాదాలను ప్రతీ ఇంటికి వేస్తున్నారు. ఆదివారం మండలంలోని పీరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో హిందూ ఉత్సవ కమిటీ, రామభక్తులు, బీజేవైఎం మండల నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని ఇళ్లను జై శ్రీరామ్ అనే అక్షరాలతో పెయింటింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీరాముడి నామం ప్రతీ ఇంటికి చేరాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నర్సింలు, శ్రీనివాస్, అంజి, పాల్గొన్నారు.

రాములోరి అక్షితల పంపిణీ

దౌల్తాబాద్: మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామపెద్దలు ఇంటింటికీ అయోధ్య అక్షితలను పంపిణీ చేశారు. అనంతరం డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈనెల 22న ప్రతి ఇంటి ముందు దీపాలను వెలిగించాలని కోరారు.


కుల్కచర్ల: జైశ్రీరామ్ నినాదాలను పెయింటింగ్ వేస్తున్న భక్తులు

దోమలో..

అయోధ్యలో ప్రతిష్ఠించే శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనలో భాగంగా కొండాయపల్లి గ్రామస్తులకు అక్షితలు పంపిణీ చేశారు. ఆదివారం మండలంలోని కొండాయపల్లి గ్రామంలో శ్రీరాముడి అక్షితలను గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ 22వ తేదీన దేశం మొత్తం పండుగ జరుపుకొంటుందని, ప్రతి ఇంటిలో దీపాలను వెలిగించి పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిష్టమ్మ, ఉపసర్పంచ్, గ్రామస్తులు కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆవాసాల్లో..

కుల్కచర్ల: మండల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీరామ స్పర్శ అక్షితలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఆదివారం కుల్కచర్ల మండలం టేకుల తండా, చెరువుముందలి తండా, గోరిగడ్డ తండా, లాల్‌సింగ్ తండా తదితర ప్రాంతాల్లో శ్రీరాముడి అక్షితలు అందజేశారు. కార్యక్రమంలో కాంగారి అంజనేయులు, గుండుమళ్ల చందు, రాజేందర్ నాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


అక్షితలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో అక్షితల పంపిణీ

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీకేశవస్వామివారి ఆలయం, మండలంలోని చిట్లపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో రాములోరి పూజిత అక్షితలను పంపిణీ చేశారు. అర్చకులు అక్కి శ్రీనివాసాచార్యులు అక్షితల కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందూవాహిని కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ పూజిత అక్షితలను పంపిణీ చేశారు. చిట్లపల్లి గ్రామంలోని ఆలయంలో అక్షితల కలశానికి పూజలు నిర్వహించి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ అక్షితలను అందజేశారు. దారిపొడవునా శ్రీరామ జయరామ జయజయరామ అంటూ భక్తిపారవశ్యంతో భజనలు చేస్తూ అక్షితలను పంచారు.


కొండాయపల్లిలో అక్షితలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు